## క్లుప్తంగా

### బీఆర్‌ఎస్‌లో చేరికలు



మక్తల్: పట్టణానికి చెందిన రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘంఉపాధ్యక్షుడు ఎస్‌బీ నాయుడుతో పాటు పలువురు ఆదివారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

### మక్తల్ డివిజన్ ఏర్పాటు చేయాలి

మక్తల్: నియోజకవర్గ కేంద్రమైన మక్తల్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు భగవంతు ఆదివారం పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. మక్తల్‌లో ఎన్నో వనరులు ఉన్నా డివిజన్‌గా ఎందుకు మార్చడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

### పీఎం సడక్ యోజనతో గ్రామాలకు రోడ్డు



దామరగిద్ద: పీఎం సడక్ యోజనతో గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ రావు అన్నారు. మండలంలోని లోకుర్తి నుంచి గట్‌రెడ్డిపల్లి, చాకలోన్‌పల్లి మీదుగా ముస్తాపేట్ గ్రామం వరకు రూ. 3.77 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహిపాల్, భీములు, దేవేందర్, సాయి పాల్గొన్నారు.

### మెగా వైద్య శిబిరం

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రసాద్ దీపిక శెట్టి దంపతుల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు 250 మందికి ఉచితంగా చికిత్సలు నిర్వహించారు. వైద్య సిబ్బంది స్థానిక సీపీఎం పార్టీ నాయకులు హన్మంతు, శివకుమార్, గ్రామస్తులు పెద్దలు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



మద్దూరు: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ స్టేషన్‌కు ఆదివారం తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మద్దూరులోని సత్యనారాయణ టాకీస్ సమీపంలో తెల్లవారు జామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను, గాజుల కుంట సమీపంలో మరో ట్రాక్టర్‌ను గస్తీ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

కృష్ణా: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం 10.30 నిమిషాలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ పూర్ణిమా పాటీల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని, గౌరవ ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### ఐక్యవేదిక జిల్లా కమిటీ ఎన్నిక



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ ఉపకులాల జాతీయ అధ్యక్షుడు చందు గణపతి, ప్రచార కార్యద్శి తాటికొండ నారాయణ, నాయకులు డెక్కలి రత్నం నేతృత్వంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నారా కొండయ్య దాసరి, అధ్యక్షుడిగా సల్లా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా దాసరి విజయ్, అధికార ప్రతినిధిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా సల్లా మాధవ, కమిటీ సభ్యులుగా నర్సిములు, కల్లెం లింగప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురువాటి రామకృష్ణ, సిరిగి శ్యాం గోపాల్, కల్లెరాజు పాల్గొన్నారు.

# టార్పాలిన్లు ఇవ్వండి సారూ

- నాలుగేళ్లుగా సబ్సిడీ పథకం నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు



మాద్వార్‌లో యూరియా సంచులపై ధాన్యం ఆరబోసిన రైతులు

మక్తల్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం వర్షానికి తడవకుండా ఉండేందుకు ప్రభుత్వం రాయితీపై టార్పాలీన్ కవర్లను సరఫరా చేస్తుంది. కానీ నాలుగేళ్లుగా ఈ పథకం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల అకాల వర్షాలు కురుస్తుండడంతో ధాన్యాన్ని తవడకుండా కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో యూరియా బస్తాలపై ధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో ఇప్పటికైనా ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలీన్లు అందించే విషయంపై పునరాలోచించాలని, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని రైతులు ప్రస్తుత సీజన్‌కు సంబంధించి భారీస్థాయిలో వరిని సాగుచేశారు. ఇటీవల కోతలు మొదలు పెట్టారు. కాగా సేకరించిన ధాన్యాన్ని ఆరబెట్టి అకాల వర్షాల బారినుంచి కాపాడుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ధాన్యంపై కప్పేందుకు ప్రైవేట్‌గా టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇదివరకు 50 శాతం రాయితీపై టార్పాలిన్లు పంపిణీ చేసేదని దీంతో ఖర్చులు తగ్గేవని ప్రస్తుతం పథకం నిలిపివేయడంతో అవస్థలు పడుతున్నామని రైతులు అంటున్నారు.

#### సబ్సిడీపై అందించాలి..



ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించే పథకాన్ని నిలిపి వేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అకాల వర్షాలు పడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్‌గా రూ. వేలు ఖర్చు చేసి టార్పాలిన్‌లు కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకోవాలి

–అరికెరి సవరప్ప, మాద్వార్

#### ఇబ్బందులు పడుతున్నాం..



వ్యవసాయ అధికారులు ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వక పోవడంతో టార్పాలిన్లు రైతులకు అందడం లేదు. మేము పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. రూ. వేలు ఖర్చు చేసి టార్పాలిన్లు కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి టార్పాలిన్లు సబ్సిడీపై అందించేలా చర్యలు తీసుకోవాలి.

– నాగేష్, పస్పుల

#### ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..

ఇదివరకు రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించడానికి అవకాశం ఉండేది. కానీ నాలుగైదేళ్లుగా సబ్సిడీని నిలిపివేశారు. విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేసి రైతులు ఇబ్బందులు పడకుండా సబ్సిడీ పై టార్పాలిన్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– జాన్‌సుధాకర్, డీఏఓ ,
నారాయణపేట

### ఆర్థిక సాయం అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: మిత్రుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ధర్మాపూర్‌కు చెందిన బైని వెంకటేష్ ఆదివారం చనిపోగా.. విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. అలాగే 1985– 86 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సైతం గ్రామానికి చేరుకుని తమకు తోచినంత ఆర్థిక సాయం చేసి వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### కార్యనిర్వాహక సభ్యుడిగా అబ్దుల్ రహీం

మద్దూరు: జిల్లా హజ్ సొసైటీ కార్యనిర్వాహక సభ్యుడిగా మద్దూరు పట్టణానికి చెందిన అబ్దుల్ రహీం ను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు అమీరుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో హజ్ సోసైటీలో గతంలో 16 మంది సభ్యులతో కూడిన కమిటీ ఉండేదని మద్దూరు, కోస్గి, ఉట్కూర్ మండలాల నుంచి ఒక్కొక్కరిని అదనంగా ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని పోతన్‌పల్లిలో కురుమూర్తిస్వామి ఆలయం దగ్గర నూతనంగా దుర్గామాత, ఆంజనేయస్వామి విగ్రహాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా దుర్గామాత, ఆంజనేయస్వామి విగ్రహాలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి భక్తిని చాటుకున్నారు. సాయంత్రం మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు విచ్చేసిన బంధుమిత్రులు, ఆడపడుచులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ, ఆలయ ధర్మకర్త చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భరోసా సభకు తరలిన బీఎస్పీ నాయకులు



మరికల్ నుంచి వెళ్తున్న నాయకులు



మాగనూర్‌లో..

మరికల్: హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు ఆదివారం మరికల్ నుంచి బీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రీనివాస్ మాట్లాడుతూ దొరల చేతిలో బందిగా మారిన తెలంగాణను విముక్తి చేయడం కోసం ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, వెంకటేష్, అనిత, వెంకటయ్య, రవికుమార్, అరవింద్, బాల్‌రాజ్, వెంకట్రమాలు, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

మాగనూర్: మండలం నుంచి సభకు తరలివెళ్లిన వారిలో అధ్యక్షుడు సగరం రమేష్, నాయకులు శ్రీనివాసు, వెంకటేష్, అర్జున్, శంకర్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## ‘ఇంకెన్నిసార్లు మభ్య పెడతారు’

నారాయణపేట టౌన్ : జిల్లాకు సాగునీరు అందిస్తామని 7 ఏళ్లుగా ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అరిగిపోని రికార్డులా ప్రకటిస్తున్నారని తాజాగా మరోసారి మభ్యపెట్టారని, ఇకనైనా వాస్తవాలు మాట్లాడాలని బీజేపీ జిల్లా లీగల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి పథకం కేవలం తాగునీటి కోసమేనని సుప్రీం కోర్టు కుండబద్దలు కొట్టినా, సీఎం కేసీఆర్ పనులు పూర్తి చేసి తాగునీరు అందిస్తామని ప్రకటించినా మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాలమూరు ద్వారా ప్రత్యేకంగా నారాయణపేట కాల్వ ద్వారా జాయమ్మ చెరువు నింపి సాగునీరు అందిస్తామని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ధన్వాడ: ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ధన్వాడ పెద్ద చెరువుకు నీరు తీసుకువస్తానని గత 8 సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నారు తప్ప చేతల్లో చూపడం లేదని కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యావర్గ సభ్యులు గోవర్ధన్‌గౌడ్, బీజేపీ జిల్లా మీడియాసెల్ సహకన్వీనర్ ఉమేష్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో తిరిగి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని అన్నారు.

## వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



జాజాపూర్‌లో మాట్లాడుతున్న కృష్ణమాచారీ



నారాయణపేట రూరల్ : జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ కృష్ణమాచారీ అన్నారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో నిర్వహిస్తున్న యోగా, జాజాపూర్ గ్రామంలో జరుగుతున్న వాలీబాల్ శిబిరాలను ఆదివారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ నర్సింహులు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి అమరేష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మొల్గాన్ జనార్దన్, పీఈటీలు రత్నయ్య, సాయినాథ్, భాస్కర్‌రెడ్డి, గోపాల్, జాకీర్, శంకర్ పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిబిరం కొనసాగుతోంది. విద్యార్థులకు స్థానికుడు శరణ్ గోపాల్ రెడ్డి ఆదివారం అల్పాహారం సదుపాయం కల్పించారు. పీఈటీ వెంకటప్ప, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి, కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్నవీరయ్య అన్నారు. కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఆదివారం 25వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నవీరయ్య మాట్లాడుతూ కరాటే నేర్చుకునేవారు చదువులో కూడా ముందుంటారన్నారు. కరాటే శిక్షణ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో 25 ఏళ్ల నుంచి ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. క్లబ్ విద్యార్థులు నేపాల్, దుబాయ్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ, కార్యదర్శి అబ్దుల్ జకీ, బీఆర్‌ఎస్ నాయకుడు వినోద్, క్లబ్ ఉపాధ్యక్షులు బాలు, మహేందర్ నాయక్, హమీద్ అలీ, కోశాధికారి తిరుపతయ్య, సీనియర్ కరాటే మాస్టర్లు సాలం బిన్ ఉమర్, కేశవ్‌గౌడ్, రవి నాయక్, కె.రవికుమార్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘రోడ్డుకు మరమ్మతు చేయిస్తాం’



ఆర్థికసాయం అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

కృష్ణా: మురహర్‌దొడ్డి బీటీ రోడ్డుకు ఆ శాఖ అధికారులతో మాట్లాడి మరమ్మతు చేయిస్తామని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మురహర్‌దొడ్డిలో పల్లెపల్లెకు వీజేఆర్ ఫౌండేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొంతకాలంగా బీటీ రోడ్డు గుంతలమయం కావడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, మరమ్మతు చేయించాలని కోరారు. అనంతరం ఇటీవల పిడుగుపడి మృతిచెందిన వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, రాకేష్, ఉప సర్పంచ్ తిమ్మప్ప, జంబయ్య, బాలప్ప, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మే డే వారోత్సవాలు



మాట్లాడుతున్న నాయకులు

అమరచింత : కేంద్రలోని మోదీ సర్కార్ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేస్తూ శ్రమ జీవుల హక్కులను హరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ అన్నారు. పట్టణంలోని జీఎస్ భవన్ ఆవరణలో ఆదివారం మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: దేశంలో కష్టజీవులు ఉన్నంతకాలం ఎర్ర జెండా ఉంటుందని, వారి పక్షాన పోరాటం చేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి డంగు కుర్మయ్య అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వెంగళాయిపల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 9వ తేదీన మండలంలో పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు వివరించారు. కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు మల్లెపు నర్సింహ, చిన్న కుర్మయ్య, శివ, కుర్మయ్య, చిన్న వెంకటయ్య, శేషయ్య, నరసమ్మ, రాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

### గుంతలమయంగా రహదారులు

నర్వ: మండలంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిత్యం నర్వ నుంచి రాంపూర్ గేట్ వరకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా యాంకీ నుంచి పెద్దకడ్మూర్, పెద్దకడ్మూర్ నుంచి నాగల్‌కడ్మూర్ వరకు బీటీ రహదారి దెబ్బతినడంతో నిత్యం అమరచింత, ఆత్మకూర్‌కు వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. పాథర్చేడ్ నుంచి రాయికోడ్, పాథర్చేడ్ నుంచి మంథన్‌గోడ్ వరకు ఉన్న బీటీ రహదారులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

### పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కోస్గి: ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు సంబంధించిన మెడికల్ బిల్లులు, సప్లమెంటరీ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేరి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కాలయాపన చేయకుండా పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు నరసింహ. వెంకటేష్, రాంగోపాల్, వెంకట్రాములు, పరంధాములుతోపాటు పలువురు పాల్గొన్నారు.

### ఘనంగా కట్ట ఎల్లమ్మ బోనాలు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో కట్ట ఎల్లమ్మ విగ్రహం ప్రతిష్ఠించిన తర్వాత ఆదివారం గ్రామస్తులు బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపు చేపట్టారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

ధన్వాడ: మండల కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ అధికారి ప్రదీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామస్తులు గమనించి సహకరించాలని కోరారు.

### కొనసాగుతున్న కార్యదర్శుల సమ్మె



మక్తల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె మండలంలో కొనసాగుతోంది. ఆదివారం పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేసేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. అధ్యక్షుడు అశోక్‌గౌడ్, కురుమూర్తి, శ్రావణి, శివయ్య, విష్ణు, వెంకటమ్మ, ఛట్టో, వెంకట్‌రెడ్డి, ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలో కొనసాగుతున్న సమ్మెలో జీపీఎస్, ఓపీఎస్ సంఘాల నాయకులు అర్జున్, లోకేష్, రాజశేఖర్, రాఘవేందర్, అనిత, శరత్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప స్వామి జాతర



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న గ్రామస్తులు

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో బీరప్పస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి గ్రామంలో బీరప్ప ఉత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగానే ఆదివారం ఉత్సవాలు నిర్వహించారు. మొదటిరోజు బీరప్ప స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల కార్యక్రమాలు, సాయంత్రం బోనాల ఊరేగింపు చేపట్టారు. గొల్ల కురుమలతోపాటు యాదవులు అందరూ గ్రామంలోని రచ్చకట్ట నుంచి పూనకాలు ఊగుతూ బోనాలతో బీరప్ప ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో శకటోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఎన్ని గొర్రెల మందలు ఉన్నాయో వాటి యజమానులు మొక్కుకున్న ప్రకారం స్వామివారి ఆలయం ముందు గొర్రెలను బలిచ్చారు. సర్పంచ్ పుల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆశన్న, పులేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అధ్వానంగా రహదారులు



మస్తీపురం గ్రామం మిట్టపై..



జూరాల ప్రాజెక్టుపై..



మస్తీపురం శివారులో కోతకు గురైన రహదారి

అమరచింత : మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు దెబ్బతినడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారి అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదంటున్నారు. జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారిని కృష్ణా పుష్కరాల సమయంలో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. అదేవిధంగా మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు బీటీ రహదారిని పూర్తి చేసినా, మిగిలినా దారిని విస్మరించారు. దీంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రహదారి మరింత అధ్వానంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వాహన దారులు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తిచేసి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

### పీయూ బీసీ విద్యార్థి జేఏసీ ఎన్నిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి జేఏసీని ఆదివారం బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ చైర్మన్ రాచాల యుగేందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పీయూ జేఏసీ అధ్యక్షుడిగా తాయప్ప, ఉపాధ్యక్షులుగా నాగరాజు, రజనీకాంత్, కోశాధికారిగా శ్రీవిద్య, ప్రధాన కార్యదర్శిగా శివ ఎన్నికవగా.. రాచాల వారిని శాలువాతో సన్మానించారు.

### ఆకస్మిక తనిఖీ

మక్తల్: పట్టణంలో ఉన్న లాడ్జీలను మక్తల్ సీఐ సీతయ్య, ఎస్‌ఐ పర్వతాలు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాడ్జీలో ఉన్నవారి ఆధార్‌కార్డులు, ఇతర వివరాలు పరిశీలించారు. పూర్తి వివరాలు లెకుండా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అన్నారు. అదేవిధంగా కొత్తవారు వచ్చినప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.